# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 320: శ్రీ కృష్ణుని మీద ఉన్న అపార్థాలపై విశదీకరణ
# మే 18, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 2, పేజీలు 360-366 నుండి తీసికొనబడినవి

స్వామి! మాకు చాలా విషయాల గురించి సరైన జ్ఞానం లేదు. దైవత్వం గురించి మాకు అసంపూర్ణ జ్ఞానం మాత్రమే ఉంది. అందువలన సత్యాన్ని వదిలేసి దైవత్వం గురించి సందేహిస్తుంటాం. మా దురదృష్టం కొలదీ భగవంతునిలో కూడా లోపాలు వెదుకుతుంటాం. మానవునిలో కనబడే పొరబాట్లు భగవంతునిలో కూడా అన్వయించుకుంటాం. మహాభారతంలో కృష్ణుడు పాండవుల తరపున పక్షపాతంగా ఉన్నట్లు కనబడతాడు. వారిని కాపాడుట కొరకు ఒక అవతార మూర్తి చేయకూడని పనులు ఎన్నో చేస్తాడు. ద్రోణాచార్య, భీష్మాచార్య, సైంధవుడు వంటి ఎందరివో సంహారాలు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ అపార్థాలను తొలగించి అసలు విషయం విశదపరచండి.

భగవాన్: భగవంతుడు దోష రహితుడు, నిష్కళంకమైన, నిర్మలమైన వాడు. భగవంతునిలో తప్పులు పట్టడం మహా పాపం. భగవంతునిలో ప్రతి అంగుళం నిస్వార్థమైనదే. భగవంతుడు చేసే ప్రతి పని మానవ శ్రేయస్సు కొరకు చేసినదే. భగవంతుడు ఎల్లప్పుడూ ఇస్తూనే ఉంటాడు, క్షమిస్తూనే ఉంటాడు. ఈ జగత్తులో తనది కానిదేది ఉంచుకోడు.

కలి ప్రభావం వల్లనేమో మనుషులలో స్వార్థ, స్వప్రయోజన భావాలు వల్ల శారీరిక, మానసిక కలతలు పరిపాటి అయిపోయాయి. ఈనాడు మానవునిలో ఏ మాత్రము కృతజ్ఞతా భావం కనబడుట లేదు. తన తల్లితండ్రులనే అలక్ష్యం చేస్తున్నాడు. రాక్షస ప్రవర్తన అధికమౌతోంది. అందువలన భగవంతుని గుర్తించడం కష్టమౌతోంది.

కౌరవులు దుర్మార్గులు. వారి జీవితమంతా అన్యాయము, అసత్యము, అధర్మములలోనే గడిపిన వారు. ద్వేషము, అసూయలతో నిండిన వారు. వారి దురాశ, లోభం వల్ల పాండవులకు విషం పెట్టడం, వారి ఇంటికి మంట పెట్టడం, వారి చేత జూదం ఆడించి వారిని మోసం చేయడం వంటి ఎన్నో క్రూరమైన పనులు చేసారు. వారిని అదుపులో పెట్టవలసిన అవసరం ఉండింది.

ఒక వజ్రమును ఇంకో వజ్రముతో మాత్రమే పగులగొట్ట గలము. ఒక ముల్లును ఇంకో ముల్లుతో మాత్రమే తీయ గలము. ఒక చిన్న ఉదాహరణతో ఇది స్పష్టమౌతుంది. దొంగలు మీ విలువైన వస్తువులతో దొడ్డి వాకిలిలోంచి పారిపోతే వారిని పట్టుకోవడానికి మీరు కూడా దొడ్డి దారిలోనే వెళ్ళాలి కదా. ఆ సమయంలో "నేను ఈ ఇంటి యజమానిని. నేను ముందు వాకిటి తలుపులోంచే వెళ్తాను" అనలేవు కదా. ఆ దొంగలను పట్టుకోవాలంటే దొడ్డి దారే మార్గము. అదే విధంగా అన్యాయమైన మార్గములో పోతున్న కౌరవులను అరికట్టడానికి కృష్ణుడు అదే చేయవలసి వచ్చింది. పాండవులను రక్షించి వారికి విజయం చేకూర్చడానికి కృష్ణుడు చేసి పనిలో ఇసుమంతైనను స్వార్థము లేదు.

స్వామి! కృష్ణుడు ధర్మరాజుతో "అశ్వత్థామ హతః" (అశ్వత్థామ చనిపోయాడు) అని చెప్పించి తర్వాత "కుంజరః" (ఏనుగు) అని తగ్గించిన గొంతుతో అంటాడు. అది విన్న ద్రోణాచార్యుడు వెంటనే మరణిస్తాడు. కృష్ణుడు ఆ విధంగా ధర్మరాజు చేత అసత్యము చెప్పించడం సవ్యమా?

భగవాన్: మీకు వాస్తవం తెలియక అడిగిన అవివేకమైన ప్రశ్న ఇది. ఇక్కడ కృష్ణుడిలో తప్పు లేదు, ధర్మరాజులో కూడా తప్పు లేదు. ద్రోణుడి పొరపాటు వల్లనే అతడు మరణించాడు. ధర్మజుడు "అశ్వత్థామ హతః" అని గట్టిగా చెప్పి "కుంజరః" అని తగ్గు గొంతులో చెప్పాడు. అంటే "అశ్వత్థామ అనే ఏనుగు చనిపోయింది" అని అర్థం. కానీ ధర్మజుడు చెప్పిన మాటను ద్రోణుడు పూర్తిగా వినలేదు. "అశ్వత్థామ హతః" అని మాత్రమే విన్నాడు. కొడుకుపై మమకారం వల్ల అది విన్న వెంటనే ద్రోణుడు మరణించాడు. అతని మమకారమే అతని మరణానికి కారణం. ధర్మరాజు చెప్పినది మొత్తం శాంతంగా వినకపోవడం వల్ల తప్పు ద్రోణుడిలోనే ఉంది. అర్జునుడిని తన కొడుకు సమానంగా ప్రేమించిన ద్రోణాచార్యుడు అర్జునితో యుద్ధం చేసి చంపడం ఎలా ఆమోదిస్తారు? గురువు, బ్రాహ్మణుడు అయిన ద్రోణుడు యుద్ధం చేయడం సవ్యమా? అందువలన ద్రోణాచార్యునిదే పొరపాటు.

స్వామి! మహాభారతంలో అభిమన్యుడు, ఘటోత్కచుడు వంటి యుక్త వయసులో ఉన్నవారు వారి తప్పు లేకుండా మరణించడం విచారకరమైన విషయం. దుర్మార్గులు మరణిస్తే న్యాయంగానే అనిపిస్తుంది. కానీ ఈ యువకుల మరణాలను ఎలా సమాధానపరచుకోవాలి?

భగవాన్: ఈ ప్రశ్నకు సమాధానం అర్థమయ్యేలా ఒక ఉదాహరణ ఇస్తాను. మీ ఇంటిలో దోమలు ఎక్కువగా ఉంటే ఏమి చేస్తారు? దోమలు పోవడానికి ఫ్లిట్, డి.డి.టి. వంటివి కొడతారు. అప్పుడు దోమలన్నీ ఒకే సారి చచ్చిపోతాయి. మిమ్మల్ని ఒకటో రెండో దోమలు మాత్రమే కుట్టి ఉంటాయి కానీ ఆ స్ప్రే వల్ల మిమ్మల్ని కుట్టని దోమలు కూడా చచ్చిపోతాయి. అదే విధంగా యుద్ధంలో కొందరు తప్పు చేయని వారు కూడా మరణించుట సహజమే.

స్వామి! పద్మవ్యూహాన్ని ఛేదించి విజయవంతంగా బయటకు రాగలిగిన వాడు అర్జునుడు ఒక్కడే అని వింటుంటాము. అభిమాన్యుడు లోనికి ప్రవేశించడం నేర్చుకున్నాడు కానీ తిరిగి బయటకు రావడం తెలియనందువలన మరణించాడు అని మహాభారతంలో చదువుతాం. అభిమన్యుడు తల్లి గర్భంలో ఉన్నపుడు నారదుడు పద్మవ్యూహం గురించి వివరించి చెప్తుండగా అందులోంచి ఎలా బయటపడాలో చెప్పే లోపల కృష్ణుడు అడ్డు పడ్డాడని విన్నాం. ఈ కథ గురించి మీ ఉద్దేశం ఏమిటి స్వామి?

భగవాన్: భారత దేశపు ప్రాచీన పురాణాలలో అర్థం చేసుకోవలసిన రహస్యాలు ఎన్నో ఉన్నాయి. చాలా మందికి తెలియని సూక్ష్మ విషయాలు అనేకం ఉన్నాయి. అవి జీవితానికి మార్గం చూపుతాయి. సమాజంలో మనకున్న బాధ్యతలు, కర్తవ్యాలు, ధర్మములను చక్కగా తెలియచేస్తాయి. మనలో ఉన్న తప్పు ఒప్పులను కూడా చూపిస్తాయి. అవి సరిదిద్దుకొని సన్మార్గమున నడుచుకుంటే మనలో ఉన్న దైవత్వాన్ని అనుభవించవచ్చు. పురాణాలలో, మహాకావ్యాలలో చదివే ప్రతి కథలో ఒక సందేశం ఉంటుంది.

అర్జునికి సవ్యసాచి, ఫల్గుణ, పార్థ, విజయ వంటి రకరకాల పేర్లు ఎన్నో ఉన్నాయి. అవి ఇప్పుడు ఎండే పద్మశ్రీ, పద్మభూషణ్ వంటివి కంటే గొప్పవి. అర్జునుడు కృష్ణునికి సంపూర్ణ శరణాగతి అయిపోయాడు. అందువలనే అభేద్యమైన పద్మవ్యూహం లోంచి బయటకు వచ్చే సామర్థ్యం అతనికి వచ్చింది. 'అర్జున' అంటే శ్వేతవర్ణం, స్వచ్ఛం. అతని స్వచ్ఛమైన మనసు వలన అతడు ఎంతో సామర్థ్యం కలిగి ఉన్నవాడు.

కానీ అభిమన్యుని పరిస్థితులు వేరు. తప్పని పరిస్థితులలో భార్య ఉత్తర గర్భంతో ఉన్న సమయంలో, తండ్రి అర్జునుడు ఇంట్లో లేని సమయంలో, మామ కృష్ణుడు దగ్గర లేని సమయంలో యుద్ధభూమికి ఏగ వలసి

వచ్చింది. అభిమన్యునికి భార్య, తండ్రి పై ఎంతో అభిమానం. ఈ అభిమానమే అతనిని పద్మవ్యూహంలో బంధించి బయటకు రాలేక మరణానికి దారి తీసింది.

అదే విధంగా, ప్రపంచమే ఒక పద్మవ్యూహం. మన జీవితమే ఒక పద్మవ్యూహం. మానవుడు ఈ పద్మవ్యూహంలో చిక్కుకొని అతని అనురాగ, అభిమానముల వల్ల విముక్తి పొందలేకున్నాడు. అతనికి అభిమానం ఉండడం వలన అభిమన్యుడు అన్న పేరు కలిగినవాడు.

స్వామి! ద్రౌపది మయసభలో దుర్యోధనుణ్ణి చూసి నవ్వినందుకు అతని కోపం, ప్రతీకారం వల్ల కురుక్షేత్ర యుద్ధానికి దారి తీసింది. మీ వ్యాఖ్యానం ఏమిటో దయచేసి వివరించి చెప్పండి.

భగవాన్: ఇవి వాస్తవం తెలియని వారు చెప్పే కథలు. ద్రౌపది సామాన్యమైన స్త్రీ కాదు. ఆమె మహారాణి, గొప్ప పతివ్రత. పాండవుల ధర్మపత్ని. ఆమె దుర్యోధనుణ్ణి మయసభలో చూసి నవ్విందనడం హాస్యాస్పదం. అలా భావిస్తే మీదే పొరపాటు. ఆమెది ఇతరులను చూసి నవ్వే లక్షణం కాదు. వాస్తవంగా ఏమి జరిగిందో తెలియని వారు ఇలా భావిస్తారు.

ఆ రోజు తలస్నానం చేసిన తర్వాత ద్రౌపది తల ఆర్చుకుంటూ అంతఃపురం లోంచి బయటకు రాబోతుంది. అప్పుడే దుర్యోధనుడు నీరు ఉందని చూసుకోకుండా అడుగు వేసి కింద పడ్డాడు. అది చూసి చెలికత్తెలు నవ్వడం మొదలు పెట్టారు. ద్రౌపది అప్పుడే బయటకు రావడం చూసి ఆ నవ్వు ఆమెదేమో అని దుర్యోధనుడు పొరబాటు పడ్డాడు. నిజానికి ఆమె అసలు నవ్వలేదు.

ద్రౌపదిలో ఏ పొరపాటు లేదు. ఆమె గొంతెత్తి ఎప్పుడూ మాట్లాడలేదు. ఆమెకు ఉన్న దానితో సంతృప్తి చెంది పాండవులకు సేవ చేయడానికి ఎప్పుడూ వెనుకాడలేదు. అందరిలోకి ఆమె వైభవశాలి. దుర్యోధనుణ్ణి కానీ ఇంకెవరినైనా చూసి ఆమె నవ్విందనుకోవడం మీ పిచ్చితనం.

వచ్చే వారం కృష్ణుడి గురించి స్వామి చెప్పిన మరిన్ని కథలతో మళ్ళీ కలుద్దాం. ధన్యవాదములు!

ఓం సాయి రామ్